నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, గురువారం 7 నవంబర్ 2024 | KAMAREDDY



గోదావరి నదిలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన అనురాధ నుంచి వివరాలను సేకరిస్తున్న బాసర సీఐ, ఎస్సైలు మల్లేశ్, మహేశ్

# ఎమ్మెల్యేలకు ఝలక్!

- సర్దుబాటు ఉపాధ్యాయులంతా వెనక్కి..
- ఆరేండ్ల కాలంలో రూ.కోట్లలో అవినీతి
- విద్యాశాఖను కుదిపేసిన 'నమస్తే తెలంగాణ' కథనం
- రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రయోగించాలంటున్న టీచర్లు

## సిఫార్సు లేఖలు రద్దు చేసిన కామారెడ్డి కలెక్టర్

నిజామాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకు కామారెడ్డి కలెక్టర్ ఝలక్ ఇచ్చారు. ప్రభుత్వ నిబంధనలకు పంగానామాలు పెట్టి.. ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఎడాపెడా జారీ చేసిన సిఫార్సు లేఖలను కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ రద్దుచేశారు. ఉపాధ్యాయులకు డీఈవో ఇచ్చిన పోస్టింగ్‌లు చెల్లవని కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. కామారెడ్డి విద్యాశాఖ అధికారి తీరుపై కలెక్టర్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు ఆయన నిర్ణయాలపై సమీక్షించేందుకు సిద్ధం అవుతున్నట్లు సమాచారం. డీఈవో తీరుపై ఉన్నతాధికారులు సైతం తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు మదన్ మోహన్ రావు, లక్ష్మీకాంతారావు పేర్లు చెప్పి పలు చోట్ల అక్రమంగా ఎంఈవోలపై ఒత్తిడి తీసుకు వచ్చి సర్దుబాట్లు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కామారెడ్డి జిల్లా విద్యాశాఖ పనితీరులో అనవసరమైన జోక్యంతో ఓ వైపు శాసనసభ్యులు నవ్వుల పాలవ్వగా, మరోవైపు డీఈవో తీరుతో విద్యాశాఖ పరువు మంటగలుస్తున్నది. ఈనెల 6న 'నమస్తే తెలంగాణ' జిల్లా సంచికలో 'సర్కారు జీవోకు సర్దుపోటు' శీర్షికతో ప్రచురితమైన కథనం విద్యాశాఖను కుదిపేసింది. కామారెడ్డి విద్యాశాఖలో కీలక అధికారికి మూడు నెలల క్రితమే బదిలీ జరిగినప్పటికీ కదలకుండా ఇక్కడే తిష్ట వేసుకోవడంపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి.


నమస్తే తెలంగాణ
నిజామాబాద్
రద్దు చేయాలి
సర్కారు సర్దుపోటు
పంచాయతీలో 'అవినీతి జలగలు'పై ఆరా!



### ఆరేండ్లలో రూ.కోట్లలో అవినీతి...

బోధనపై అవగాహన లేకుండా కామారెడ్డి విద్యాశాఖ ఉన్నతాధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆయన.. ఆరేండ్లుగా కొనసాగుతున్నారు. ఈ కాలంలో అక్రమ వ్యవహారాలు వేలల్లో జరగగా.. రూ.కోట్ల అవినీతి జరిగినట్లు ప్రచా రం జరుగుతున్నది. ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులను మచ్చిక చేసుకొని విద్యాశాఖ కార్యాలయాన్ని అవినీతికి అడ్డాగా మార్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. జీవో నంబర్ 25ను అమలు చేయాలంటూ 2024, సెప్టెంబర్ 29న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను తొక్కిపెట్టిన చందంగానే గతంలోనూ అనేక విధాలుగా ఇష్టానుసారంగా అక్రమాలకు పాల్పడ్డట్లుగా ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఉపాధ్యాయ సంఘాల నేతలకు తప్ప సామాన్య ఉపాధ్యాయుల బాధలను పట్టించుకునేవాడు కాదని వాపోతున్నారు. అవినీతి, అక్రమాల ఆరోపణల నేపథ్యంలో నిజామాబాద్ డీఈవోగా పనిచేసిన దుర్గాప్రసాద్‌పై ప్రభుత్వం మూడు రోజుల క్రితం బదిలీ వేటు వేసింది. కామారెడ్డిలో మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై చర్చ జరుగుతున్నది.

### రెవెన్యూ రికవరీ యాక్ట్ అమలుకు డిమాండ్..

ఆరేండ్ల కాలంలో ప్రభుత్వ పెద్దల పేర్లు చెప్పుకొని అక్రమంగా సంపాదించిన ఉన్నతాధికారిపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రయోగించడంతోపాటు కఠిన చర్యలు తీసుకోవాలని పలు ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ విషయమై కలెక్టర్‌కు ఇప్పటికే వినతి పత్రాలు సమర్పించారు. త్వరలో గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేసేందుకు సిద్ధం అవుతున్నారు. రెవెన్యూ రికవరీ యాక్ట్‌ను అమలు చేయడం ద్వారా అక్రమార్జనను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. ఇటీవల ఎంఈవో పోస్టుల భర్తీకి ముందు వరకు ఏండ్లుగా పాతుకుపోయిన మండల విద్యాశాఖ అధికారులు సైతం అవినీతిలో పాత్రధారులుగా ఉన్నట్లు సమాచారం. వైజ్ఞానిక కార్యక్రమాల పేరుతో తిష్ట వేసుకున్న మరో టీచర్ సైతం ఇందులో భాగస్వామిగా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. విద్యాశాఖ ప్రక్షాళన చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాలు భీష్మించుకుని కూర్చున్నాయి.

# ఫైనాన్షియర్ల 'పైసా' చికత్వం

- వేధింపులకు తాజాగా మరో కుటుంబం బలి
- రాజ్యమేలుతున్న అక్రమ మైక్రో ఫైనాన్స్ దందా
- మితిమీరుతున్న అప్పులోళ్ల ఆగడాలు
- నిందితులకు బీజేపీ నేతలతో సంబంధాలు?
- పోలీసు తనిఖీలు చేపట్టినా గాడిలో పడని వ్యవస్థ

నిజామాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఫైనాన్షియర్ల ఆగడాలు మితిమీరుతున్నాయి. వారి వేధింపులు తాళలేక కుటుంబాలే బలవుతున్నాయి. పురుషులు, స్త్రీలు అనే తేడా లేకుండా అసభ్య పదజాలంతో పరువు తీసే విధంగా మాట్లాడడంతో అనమానభారం భరించలేక నిజామాబాద్ నగరానికి చెందిన ఓ కుటుంబం గోదావరి నదిలో బుధవారం దూకి ఆత్మహత్యకు యత్నించింది. ఈ ఘటనలో ఇద్దరు గల్లంతుకాగా.. ఒక మహిళను స్థానికులు సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. నగరంలోని న్యాల్‌కల్ రోడ్డులో నివాసించే వేణు, భార్య అనురాధ, కూతురు పూర్ణిమతో కలిసి గోదావరిలో దూకగా అనురాధను స్థానికులు రక్షించగా.. మరో ఇద్దరి ఆచూకీ లభించలేదు. 2022, జనవరి 10న అచ్చంగా ఇలాంటి ఘటనే జరిగింది. పప్పుల సురేశ్ అనే వ్యాపారి కుటుంబం కూడా ఫైనాన్షియర్ల వేధింపులకు బలి కావాల్సి వచ్చింది. వీడియో, ఆడియో రికార్డులను బయట పెట్టిన సురేశ్.. బీజేపీ నేత గణేశ్ వేధింపులను ప్రస్తావించి కృష్ణానదిలో దూకి ప్రాణాలు కోల్పోయారు. తాజాగా బుధవారం వెలుగు చూసిన ఆత్మహత్యాయత్నం ఘటనలోనూ నిందితులకు బీజేపీతో దగ్గరి సంబంధాలున్నట్లుగా తెలుస్తున్నది. ప్రాణాలతో బయటపడిన అనురాధ.. ఓ గుట్కా ఏజెన్సీ పేరును చెప్పడంతో సదరు వ్యక్తి బీజేపీలోనే ఉన్నట్లు తెలిస్తున్నది. రెండున్నరేండ్ల కాలంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన ఓ రెండు కుటుంబాలకు చెందిన మొత్తం ఆరుగురి చావుకు ఫైనాన్షియర్ల రాక్షసత్వం కారణం కావడం, వారందరూ ఒకే పార్టీకి చెందిన వారు కావడంచర్చనీయాంశం అవుతున్నది.

### ఫైనాన్షియర్లదే రాజ్యం..

కాంగ్రెస్ అధికారం చేపట్టిన అనంతరం పలుసార్లు మైక్రో ఫైనాన్షియర్ల ఇండ్లు, వ్యాపార స్థావరాలపై పోలీసులు దాడిచేశారు. అక్రమంగా వడ్డీ వ్యాపారం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. తనిఖీలు నిర్వహించిన పోలీసులే ఇప్పుడు అక్రమార్కులకు అండదండగా నిలవడం విడ్డూరంగా మారింది. రాజకీయ నాయకుల అండదండలతో ఫైనాన్స్ దందాను నడుపుతున్న వారి జోలికి పోలీసులు వెళ్లకుండా.. కేవలం సామాన్యుల ఇండ్లపై దాడి చేసి మమ అనిపించారు. నామమాత్రపు దాడులతోనే నేడు మరో కుటుంబం బలికావాల్సిన దుస్థితి ఏర్పడిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఫైనాన్షియర్ల ఆగడాలను నియంత్రించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రుణగ్రహీతలను వేధించొద్దని పోలీసులు చేసిన హెచ్చరికలన్నీ ఉట్టిమాటలే అని వేణు కుటుంబం ఆత్మహత్యాయత్నంతో తేలిపోయిందని వారి బంధువులు అంటున్నారు. అధికార మదం, కీలక నేతల అండదండలతోనే ఫైనాన్షియర్లు ఇష్టమొచ్చినట్లుగా ప్రవర్తిస్తున్నారని, వీరికి పోలీసులే వత్తాసు పలుకుతున్నారని చెబుతున్నారు.

### నాడు కృష్ణా.. నేడు గోదావరి..

సరిగ్గా రెండున్నరేండ్ల క్రితం కూడా ఇలాంటి అమానవీయ ఘటనే వెలుగు చూసింది. నిజామాబాద్ నగరానికి చెందిన వ్యాపారి పప్పుల సురేశ్ కుటుంబం కూడా ఫైనాన్షియర్ల తీరుకు బలి కావాల్సి వచ్చింది. వారి వేధింపులు తాళలేక విజయవాడ కనకదుర్గమ్మ వద్దకు వెళ్లి కృష్ణా నదిలో దూకి బలవన్మరణం చేసుకున్నారు. నాటి కేసులోనూ బీజేపీ నాయకుడే ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. ఈ ఘటన జరిగిన అనంతరం సదరు నాయకుడిని బీజేపీ సస్పెండ్ చేసింది. పూటకో విధంగా నీతులు మాట్లాడే ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తాకు వారి అనుచరులు చేస్తున్న ఆగడాలు కండ్లకు కనిపించడం లేదా? అని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు. తమ శ్రేణులను సన్మార్గంలో నడిపించాల్సిన నేతలే వంకర పలుకులతో గతి తప్పిన నేపథ్యంలో కింది స్థాయిలో మార్పు కోరుకోవడం అసాధ్యమనే మాటలు వినిపిస్తున్నాయి. అప్పట్లో సురేశ్ కుటుంబంలోని నలుగురిని బీజేపీ నాయకుడు బలి గొనగా, ఇప్పుడు కూడా అదే పార్టీకి చెందిన నేతల ఒత్తిడి మూలంగా వేణు కుటుంబంలోని ఇద్దరు తనువు చాలించాల్సి రావడం బాధాకరంగా మారింది.


వేణు(ఫైల్)


ప్రాణాలతో బయటపడిన అనురాధ

# వడ్డీ వ్యాపారుల రాక్షసత్వం

- డబ్బు చెల్లించకపోతే బిడ్డను వివస్త్రను చేస్తాం
- అవమానభారంతో కుటుంబం ఆత్మహత్యాయత్నం
- తండ్రి మృతి, కూతురి గల్లంతు
- తల్లిని కాపాడిన జాలర్లు


నదిలో గల్లంతైన అపర్ణ

నవీపేట/వినాయక్‌నగర్, నవంబర్ 6: వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఓ కుటుంబం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పెళ్లీడుకొచ్చిన కూతురి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఫైనాన్షియర్ల ఆగడాలు తట్టుకోలేక బాసర గోదావరిలో దూకేసింది. తండ్రి మృతి చెందగా, కూతురు గల్లంతయింది. తల్లిని జాలర్లు కాపాడారు. బాసర పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లాలోని మోత్కూర్ మండలానికి చెందిన వేణు (60)కు భార్య అనురాధ, కూతురు పూర్ణిమ (25) ఉన్నారు. 15 ఏండ్ల క్రితం నిజామాబాద్‌కు వలస వచ్చిన వేణు.. న్యాల్‌కల్ రోడ్డులో ఇల్లు అద్దెకు తీసుకొని పాన్‌డబ్బా పెట్టుకుని కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. వ్యాపార అభివృద్ధి కోసం గంజ్ మార్కెట్‌లో ఉండే వడ్డీ వ్యాపారులు రోషన్, వికాస్ వద్ద అప్పుగా రూ.3 లక్షలు తీసుకున్నాడు. అయితే, తిరిగి చెల్లించడంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో వడ్డీ వ్యాపారులు వేణుపై డబ్బు కోసం ఒత్తిడి తెచ్చారు. ఇటీవల ఇంటికి వచ్చి భార్య, కూతురుతో దుర్భాషలాడారు. వడ్డీ చెల్లించకపోతే నీ కూతుర్ని వివస్త్రను చేస్తామని హెచ్చరించారు. వారి వేధింపులు, అవమానాలు తట్టుకోలేని వేణు కుటుంబ సభ్యులు బుధవారం ఉదయం తమ స్కూటీపై బాసర గోదావరి వద్దకు వెళ్లారు. అందరూ చూస్తుండగానే నదిలోకి దూకేశారు. అక్కడున్న వారు గమనించి అనురాధను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. అయితే, ప్రవాహానికి వేణు, పూర్ణిమ గల్లంతయ్యారు. సమాచారమందుకున్న బాసర పోలీసులు గోదావరి వద్దకు వచ్చి జాలర్లతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో వేణు మృతదేహం లభించగా.. పూర్ణిమ జాడ దొరకలేదు. అనురాధతో మాట్లాడిన పోలీసులు ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకుని, కేసు నమోదు చేశారు.


గాంధీనగర్ గ్రామంలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

# బస్సులు ఆపాలని రోడ్డెక్కిన విద్యార్థులు

గాంధీనగర్‌లో రాస్తారోకో
బస్సుల సంఖ్య పెంచాలని వినతి

లింగంపేట, నవంబర్ 6: తమ గ్రామంలో బస్సులు ఆపకపోవడంతో విద్యాసంస్థలకు సమయానికి చేరుకోలేకపోతున్నామని విద్యార్థులు ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. కామారెడ్డి జిల్లా లింగంపేట మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులు తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్ గ్రామ ప్రభుత్వ పాఠశాలతోపాటు కామారెడ్డిలోని పలు ప్రైవేటు జూనియర్ కాలేజీలకు నిత్యం వెళ్తున్నారు. ఎల్లారెడ్డి – కామారెడ్డికి తిరిగే బస్సులను గాంధీనగర్‌లో ఆపడం లేదని, దీంతో తాము పాఠశాల, కళాశాలలకు సమయానికి చేరుకోవడం లేదని గాంధీనగర్‌లో బుధవారం రాస్తారోకో చేపట్టారు. ఆలస్యంగా వెళ్లడంతో ఉపాధ్యాయులు తరగతి గదిలోకి అనుమతించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. బస్సు కోసం ఉదయం ఇంట్లో తినకుండానే వస్తున్నా.. బస్సులు మాత్రం ఆపడం లేదని వాపోయారు. కామారెడ్డి – నిజాంసాగర్ రూట్‌లో 16 బస్సులను నడుపాల్సి ఉండగా.. 13 బస్సులను మాత్రమే నడుపుతున్నారన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సుల సంఖ్యను పెంచాలని, తమ గ్రామంలో బస్సులు ఆపే విధంగా చూడాలని వారు కోరుతున్నారు.

### బస్సులు ఆపడం లేదు..



మా గ్రామంలో బస్సులు ఆపకపోవడంతో కాలేజీకి సమయానికి చేరుకోవడం లేదు. దీంతో అధ్యాపకులు తరగతి గదిలోకి అనుమతించడం లేదు. చదువును మధ్యలో ఆపాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. మేము చదువుకోవాలా వద్దా..? ఆర్టీసీ అధికారులు స్పందించి మా గ్రామంలో బస్సులు ఆపేలా చూడాలి.

**-సందీప్, ఇంటర్ విద్యార్థి**

### అన్నం తినకుండా వస్తున్నం..



బస్సులు ఆపడం లేదని, అన్నం తినకుండానే స్టాప్ వద్దకు వస్తున్నం. బస్సులో ప్రయాణికులు నిండా ఉన్నారని, వెనుక ఇంకో బస్సు వస్తుందని వెళ్తున్నారు. మరో బస్సు ఎప్పుడు వస్తదో తెలియదు. పాఠశాలకు ఆలస్యంగా వెళ్లడంతో ఉపాధ్యాయులు లోనికి అనుమతించకుండా ఆరుబయట నిలబెడుతున్నారు.

**-భార్గవి, 9వ తరగతి విద్యార్థి**

## బొమ్మన్‌దేవ్‌పల్లిలో మద్యపానం నిషేధం

నస్రుల్లాబాద్, నవంబర్ 6: తమ గ్రామంలో మద్యపానం నిషేధిస్తూ.. బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామస్తులు తీర్మానించారు. గ్రామంలో మద్యం విక్రయించిన వారికి రూ.లక్ష జరిమానా విధిస్తామని, విక్రయిస్తున్నవారి వివరాలు తెలియజేసిన వారికి రూ.20వేలు పారితోషకం అందజేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మద్యం తాగి యువత పెడదారి పడుతున్నారని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.


మద్యపానం నిషేధిస్తూ తీర్మానం చేస్తున్న బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామస్తులు

# నింబాచలానికి బ్రహ్మోత్సవ శోభ

- భక్తుల కొంగు బంగారం వెలుగొందుతున్న లక్ష్మీనారసింహుడు
- దక్షిణ బద్రినాథ్‌గా ప్రసిద్ధికెక్కిన క్షేత్రం
- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు..





భీమ్‌గల్, నవంబర్ 6: మండలంలోని శ్రీ లక్ష్మీనరసింహుని దివ్య క్షేత్రం లింబాద్రి గుట్ట బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. బ్రహ్మోత్సవాలను నంబి వంశస్థులు నేటి(గురువారం) నుంచి నిర్వహించనున్నారు. వారు మాత్రమే స్వామి వారి నిత్య కైంకర్యాలు నిర్వహిస్తారు. ఆలయ ధర్మకర్తగా నంబి పార్థసారథి వ్యవహరిస్తున్నారు. గతంలో ఈ కొండకు రావడానికి రవాణాసౌకర్యం అంతంతగానే ఉండేది. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో సౌకర్యాలు మెరుగుపడ్డాయి. రూ. 2.60 కోట్లతో కొండపైకి నాలుగు లైన్ల రోడ్డు, సెంట్రింగ్ లైట్లు, గిరి ప్రదక్షిణలతో గుట్ట ప్రాంతం అందంగా కనువిందు చేస్తున్నది.

### పెరిగిన భక్తుల రద్దీ..

గతంలో కేవలం జాతర(ఉత్సవాల)సమయంలో మాత్రమే పెద్దసంఖ్యలో భక్తులు వచ్చేవారు. ఇప్పుడు ప్రతి శని, ఆదివారాల్లో భక్తుల తాకిడి పెరిగింది. ఏడాదిలో ఒకసారి మాత్రమే భక్తులు గిరి ప్రదక్షిణ చేసేవారు. మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చొరవతో గిరి ప్రదక్షిణ కోసం రోడ్డును ఏర్పాటు చేశారు. ఈ నెల 7 నుంచి క్షేత్రంపై కార్తీక బ్రహ్మోత్సవాలు మొదలుకానున్నాయి.

- 7న గ్రామదేవతలకు సారె సమర్పణ
- మధ్యాహ్నం 1.30గంటలకు స్వామి వారి ఉత్సవ విగ్రహాలు కొండపైకి పయనం
- 8న దీపారాధన,రక్షబంధనం,అంకురార్పణ, మృత్యుసంగ్రహణం, గరుడ పటాదివాసం, ధ్వజారోహణం
- 9న శ్రవణ ప్రయుక్త క్షీరాభిషేకం, నృసంహ ఏకాక్షరి హవనం
- 10న శ్రీవారి కల్యాణం, ఎదుర్కోలు
- 11న శ్రీవారి కల్యాణోత్సవం
- 12న సర్వేషాం ఏకాదశి,చాతుర్మాస్య వ్రత సమాప్తి,నృసింహ ఏకాక్షర హవనం,గీతా హవనం, గరుడ సేవ
- 13న ఉత్థాన ద్వాదశి,తులసి వివాహం, కొండ ప్రదక్షిణ
- 14న వైకుంఠ చతుర్థి, 15న కార్తీక పౌర్ణిమ, జాతర,రథోత్సవం,రథభ్రమణం
- 16న పుష్కరిణీలో స్వామి వారికి స్నపన తిరుమంజనం, చక్రతీర్థం, భాగవత ఫలశృతి,పూర్ణాహుతి, పుష్పయాగం
- 17న దేవాతోద్వాసనం,ధ్వజావరోహణం,ఉద్వాసన


పిట్లం మండలంలోని కుర్తి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

# ఆంక్షలపై రైతుల నిరసన

పెద్దకొడప్‌గల్, నవంబర్ 6: కొనుగోలు కేంద్రం వద్ద సొసైటీ సిబ్బంది ఆంక్షలు పెడుతున్నారని పిట్లం మండలంలోని కుర్తి గ్రామ రైతులు బుధవారం నిరసన వ్యక్తంచేశారు. గ్రామంలో రాంపూర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో సన్న వడ్లకు ఎరుపు రంగు, దొడ్డు వడ్లకు నీలి రంగు ప్లాస్టిక్ సుతిల్ వాడాలని, బోనస్ రావాలంటే తాము చెప్పిన నిబంధనలు పాటించాలని అధికారులు వేధిస్తున్నారని రైతులు ఆరోపించారు. 250 గ్రాముల తరుగు తీస్తున్నారని, కేంద్రం వద్ద మౌలిక వసతులు కల్పించలేదన్నారు. కొనుగోళ్లలో వేగం పెంచాలని లేనిపక్షంలో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని రైతులు హెచ్చరించారు.